క్లుప్తంగా

వంగర ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా రాజు



భీమదేవరపల్లి: మండలంలోని వంగర గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా ఉపసర్పంచ్ నల్లగోని రాజుకు బాధ్యతలు అప్పగిస్తూ డీపీఓ జగదీశ్వర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ ఆలూరి రజిత గత నెల 24న వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా వెళ్లారు. ఆమె తిరిగి వచ్చే నెల 22న వంగరకు రానున్నారు. అప్పటి వరకు ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా రాజు వ్యవహరించనున్నారు. రాజు నియామకంపై మాజీ సర్పంచ్ కండె రమేష్ హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం



శాయంపేట: మండలంలోని తహారాపూర్ గ్రామానికి చెందిన మాచర్ల సదానందంను జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఆసంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్ ప్రకటించారు. గురువారం ఆయనకు నియామకపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా సదానందం మాట్లాడుతూ బీసీల ఐక్యత కోసం ఎల్లవేళలా కృషిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్, నాయకులు దేవరకొండకొమురయ్య, చింతల భాస్కర్, బగ్గి రవి, రంగు మహేందర్, వినుకొండ శంకరాచారీ, ఉప్పు రాజు, కూరాకుల రవికి కృతజ్ఞతలు తెలిపారు.

యువజనఅధ్యక్షుడిగా శ్రీకాంత్

ఎల్కతుర్తి: కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడిగా మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన హింగె శ్రీకాంత్ నియామకం అయ్యారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హింగె శ్రీకాంత్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు రంగనాథ్, కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుకినె సంతాజీలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. శ్రీకాంత్ నియామకంపై పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నిక

ఎల్కతుర్తి: మండలంలోని సూరారం గ్రామ ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గాజుల భాస్కర్, ఉపాధ్యక్షుడిగా గడ్డం అశోక్, క్యాషియర్‌గా మోటం చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా వేణు, గౌరవ సభ్యుడిగా పులింటి సంపత్, ప్రచార కార్యదర్శిగా ఎండీ చోటు, సభ్యులుగా సదానందం, సురేష్, సదాశివ్, సంపత్, రమేష్, శంకర్ ఎన్నికయ్యారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

శాయంపేట: సారా అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు.. మండలంలోని సూర్యానాయక్‌తండాకు చెందిన బానోతు రవీందర్ తన ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు కొప్పుల నుంచి పెద్దకోడెపాక గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై తనిఖీ నిర్వహించగా అతని వద్ద 15 లీటర్ల సారా లభించినట్లు తెలిపారు. సారాతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రవీందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇందులో ఎక్సైజ్ ఎస్సై పద్మ, సిబ్బంది ఉన్నారు.

చోరీకి గురైన వ్యవసాయ మోటార్లు

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన తడక శంకర్, మండ బాబు వాగుకు అమర్చిన రూ 50,000 విలువ గల విద్యుత్ మోటార్లులను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. దీంతో బాధిత రైతులు దామెర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్నిరోజుల నుంచి మండల పరిధిలో తరచుగా వ్యవసాయ బావుల వద్ద గల విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ అధికారులు స్పందించి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

ధర్మసాగర్: మండలంలోని నారాయణగిరి గ్రామ శివారు చటల్ తండాకు చెందిన ఓ యువతి అదృశ్యమయినట్లు ధర్మసాగర్ సీఐ ఒంటేరు రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. చటల్‌తండాకు చెందిన గుగులోతు భిక్షపతి కూతురు గుగులోతు కల్పన డిసెంబర్ 30న కాలేజికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. యువతి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కల్పన ఆచూకీ తెలిస్తే 8712685127-8712685247 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజాధనం పగుళ్ల పాలు..

చెత్త చెరువు పాలు

- ఎక్కడికక్కడ పగుళ్లు చూపుతున్న డంపింగ్ యార్డ్ నిర్మాణాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తీసుకురాని వైనం

నడికూడ: పల్లెల్లోని తడిపొడి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువులను తయారు చేయడం, తద్వారా పల్లెలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు ఆదాయం లేక అవస్థలు పడుతున్న గ్రామపంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం డంపింగ్ యార్డు నిర్మాణాలు చేపట్టింది. ఇందుకోసం లక్షలాది రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో డంపింగ్ యార్డులు ఎందుకు పనికి రాకుండా పోయాయి. డంపింగ్ యార్డులు నిర్మించి కనీసం రెండు సంవత్సరాలు కాకముందే ఎక్కడికక్కడ పగుళ్లు చూపాయి. గట్టిగా ఊపితే నిర్మించిన పిట్ట గోడలు కూలిపోయేలా నాసిరకంగా నిర్మాణాలు ఉన్నాయి. కింద నిర్మించిన ఫ్లోరింగ్ మొత్తం బీటలు వారింది. కనీసం మరో రెండేళ్లు అయినా అవి ఉంటాయా అనే సందేహం కలుగుతోంది. అసలు డంపింగ్ యార్డులను ప్రారంభించారా లేదా అనే విషయంలో ఇటూ అధికారులు అటూ స్థానిక ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదు. కానీ ఎక్కడా చెత్త సేకరించి, సేంద్రియ ఎరువులు తయారు చేసిన దాఖలా కనిపించడంలేదు. మరోవైపు చౌటుపర్తి గ్రామంలో చెత్త సేకరించి స్థానికంగా చెరువులో పోస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డ్ వృథాగా నిర్మించారని ప్రజలంటున్నారు.

నిర్మాణానికి రూ 2.50 లక్షలు..

షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా నిధులను కేటాయించింది. షెడ్ నిర్మాణం కోసం రూ 2.50 లక్షల వరకు చెల్లించారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త బుట్టలను ఇప్పటికే అందజేశారు. సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డు వద్ద ప్లాట్‌ఫాంపై పోసి ప్లాస్టిక్, గాజు తదితర ఆరు రకాలుగా వేరు చేయాలి. కాగా కొన్ని గ్రామాలలో డంపింగ్ యార్డు నిర్మాణాలు పూర్తయిన వినియోగంలోకి తీసుకురాకపోవడంతో మద్యం బాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయిని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల చెత్తను వేరు చేసే కంపోస్టు గదులపై లేబుల్స్ రాయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసి ఉన్న డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నెలలో ఒకటి రెండు సార్లు తనిఖీల కోసం వచ్చిన వీటిపై దృష్టి సారించట్లేదని తెలుస్తోంది. మండల స్థాయి అధికారుల నివేదికలతో సరిపెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి పల్లెలను స్వచ్ఛమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

రామకృష్ణపూర్: పగుళ్లు తేలిన గోడ



నిర్లక్ష్యానికి నిదర్శనం



గ్రామాలు స్వచ్ఛంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి డంపింగ్‌యార్డ్, సేంద్రియ ఎరువులను తయారు చేసే షెడ్‌లను పాలకులు నిర్మించారు. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో వినియోగంలోకి రాకుండా పోతున్నాయి. గ్రామాలలో తడి, పొడి చెత్త సేకరణ కూడా పూర్తిస్థాయిలో చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావాలి.

– భైరిపాక బద్రి, కాంగ్రెస్ నాయకుడు, కంఠాత్మకూర్



రామకృష్ణపూర్ డంపింగ్ యార్డులో..



కాకొండ: వినియోగంలోకి రాని డంపింగ్ యార్డ్



చౌటుపర్తి చెరువులో పోసిన చెత్త

దరఖాస్తుల స్వీకరణ

ఐనవోలు: తెలంగాణ మైనారిటీస్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల వర్ధన్నపేటలో 2023–24 విద్యాసంవత్సరం అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వికాస్ సపావట్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మైనారిటీలకు 60, బీసీలకు 10, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, ఓసీలు 2 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు కలిపి మైనారిటీలకు 60, బీసీలకు 10, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, ఓసీలకు 2 సీట్లు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా బ్యాక్‌లాగ్ ముస్లీం మైనారిటీలకు 6వ తరగతి 18 సీట్లు, 7వ తరగతిలో 11, 8వ తరగతిలో 4 సీట్లు మిగిలి ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వికాస్ సూచించారు. పూర్తి వివరాలకు 7995057982,9866657807,8919542338 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

విధుల్లో చేరిక

ధర్మసాగర్: మండల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మండల వైద్యాధికారిగా డాక్టర్ సపవట్ గోపీనాథ్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. డాక్టర్ గోపీనాథ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం పీహెచ్‌సీ నుంచి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



లీకేజీతో కలుషితమవుతున్న తాగునీరు

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని మూడవ వార్డు సమీపంలో గల ప్రధాన రహదారి పక్కనే తాగునీటి పైపులైన్ లీకేజీ అయి తాగునీరు కలుషితమవుతుంది. పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నెలరోజులు గడుస్తున్నా అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా అధికారుల స్పందించి లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మెడికల్ వ్యర్థాల ప్రాజెక్ట్ వద్దు



మాట్లాడుతున్న ప్రమోద్‌రెడ్డి

ధర్మసాగర్(వేలేరు): వేలేరు మండలంలోని పీచర గ్రామంలో ప్రతిపాదిస్తున్న కామన్ బయో మెడికల్ వ్యర్థాల ట్రీట్మెంట్ ఫెసిలిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడతారని యూత్ నాయకుడు రఘునాయకుల ప్రమోద్‌రెడ్డి అన్నారు. వేలేరు మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీచర గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బయో మెడికల్ వ్యర్థాల వలన ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 537/అ 1/2లో కామన్ బయో మెడికల్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి తెలంగాణ పొల్యూషన్ బోర్డు స్టేట్ లెవల్ ఎన్విరాల్మెంట్ ఇంపాక్టు అసెస్మెంట్ అథారిటీ, పర్యావరణ, అటవీ వాతావరణ మార్పు శాఖల అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ జరపడానికి వస్తున్నారని అన్నారు. బయో మెడికల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి గడ్డమీది శంకరయ్య, శ్రావణ్, శ్రీధర్‌రెడ్డి, సుమన్, నవీన్, దార రాజు, హరీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఫార్మసిస్టులు, వైద్యులు

దామెర: ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఫార్మసిస్ట్ అసోసియేషన్(టీజీపీఏ) జిల్లా అధ్యక్షుడు కందకట్ల శరత్ బాబు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందిన క్యాలెండర్‌ను దామెర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెదవాఖానలో సెక్షన్ 42 ప్రకారం ఫార్మసిస్టులను నియమించాలని అన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో స్టోర్ ఇన్‌చార్జ్ పోస్టు మంజూరు చేసి, నియమించాలని పేర్కొన్నారు. జిల్లాకు ఒక ఫార్మసీ సూపర్‌వైజర్‌ను మంజూరుచేసి, అర్హులైన ఫార్మసిస్టులతో భర్తీ చేయాలని వెల్లడించారు. గ్రేడ్2 ఫార్మసిస్టులను ఫార్మసీ అధికారులుగా పేరు మార్చాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ప్రాతిపదిన పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల, డాక్టర్ వనజ, డాక్టర్ ఉషశ్రీ, జీఎంహెచ్ ఫార్మసిస్టు శివకుమార్, ఆప్తాల్మిక్ అధికారి డాక్టర్ ప్రకాష్, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, భాగ్యలక్ష్మీ, నర్సులు కరుణ, మౌనిక ఉన్నారు.

ఓటర్‌లిస్టులో తప్పులు లేకుండా చూడండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజుద్దీన్

దామెర: ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టులో జరిగిన చేర్పులు, మార్పులు చనిపోయినవారి వివరాలు బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ... చనిపోయిన వారి పేరును ఓటర్ లిస్టు నుంచి వెంటనే తొలగించాలని అన్నారు. తొలగించిన జాబితాలను గ్రామాల్లోని పోలింగ్‌స్టేషన్లలో నోటీస్ బోర్డుపై అతికించాలని సూచించారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ రామక్రిష్ణ, ఆర్ఐ భాస్కర్ రెడ్డి, బీఎల్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

బీఎస్పీకి పెరుగుతున్న ఆదరణతోనే కుట్రలు



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజు

పరకాల: బహుజన సమాజ్ పార్టీకి రాష్ట్ర ప్రజలలో పెరుగుతున్న ఆదరణను పాలకులు తట్టుకోలేకపోతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన బీఎస్పీ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో శనిగరపు రాజు మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్నందుకే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాలకులు ఎన్ని కుట్రలకు పాల్పడిన బీఎస్పీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినయ్, రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు వరికెల కిషన్‌రావు, అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీనివాస్, పరకాల అసెంబ్లీ కోశాధికారి రాజు, మండల అధ్యక్షుడు మహేందర్, ఉపాధ్యక్షుడు అంజద్‌పాషా, కార్యదర్శి భిక్షపతి, నడికూడ మండల అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ ఉన్నారు.

అందరికీ మైనార్టీ రుణాలివ్వాలి

ఆత్మకూరు: అర్హులందరికీ మైనార్టీ రుణాలు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. మండల కేంద్రంలో రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ ఎలాంటి పరిమితులు లేకుండా అందరికీ రుణాలు ఇవ్వాలని కోరారు. మండలానికి సరిపడా యూనిట్లు ఇవ్వాలన్నారు.

7న మండల స్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్

ధర్మసాగర్(వేలేరు): ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, భారతి ఫౌండేషన్‌తో మండల స్థాయిలో ఈ నెల 7న శనివారం స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు గురువారం ఎల్టా వేలేరు మండల కన్వీనర్ ఏ వెంకటేశ్వర్‌రావు, కో కన్వీనర్ రామంచ తబిత తెలిపారు. మండల స్థాయిలో ఎంఈఓ కన్వీనర్‌గా ఉంటారని, ఎల్టా కమిటీలు సహకారం అందజేస్తారని వెల్లడించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ ఆదర్శ పాఠశాలల్లో చదివే 8, 9వ తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఎల్టా నిపుణుల బృందం ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తుందని తెలిపారు. అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల కోసం తొలిసారిగా కథలు చెప్పడం, అక్షర క్రమం (స్పెల్లింగ్) పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు 7న మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పోటీలు నిర్వహించనున్నారని మండలంలోని వివిధ హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులను ఉదయం 9.30 గంటలకు వేలేరు పాఠశాలకు పంపించవలసిందిగా కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు

ఐనవోలు: నందనం గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ గజ్జెల శ్రీరాములు అన్నారు. గురువారం మండలంలోని నందనం గ్రామంలో నర్సరీ వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులతో బోరు వేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్జెల శ్రీరాములు హాజరై కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షలతో సీసీ రోడ్డును మంజూరు చేస్తానని, అలాగే గ్రామఅవసరాల మేరకు బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్, మంత్రి దయాకర్‌రావు సహకారంతో గ్రామం ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాకర మంజుల, యాదగిరి, మరుపట్ల ఏలియా, దేవదాసు, బుర్ర సదానందం, లింగం రాంచంద్రారెడ్డి, పెసరు రాజు, బండి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెరగాలి



దామెర: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెరిగేలా చూడాలని మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశవర్కులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్‌సీ కేసులు పెరిగేలా చూడాలని అన్నారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి పలు సలహాలు, సూచనలు చేయాలని ఆశలకు సూచించారు. గ్రామాల్లో ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ వనజ, హెచ్ఈఓ అశోక్‌బాబు, పీహెచ్ఎన్ సలోమి, సూపర్‌వైజర్ శ్రీకాంత్, భాగ్యలక్ష్మీ, మౌనిక, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడు దేవుడితో సమానం

- ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



గీతారాణికి సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్

భీమదేవరపల్లి: వైద్యుడు దేవుడితో సమానమని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని ముల్కనూర్ హోమియోవైద్యాధికారి గంగం గీతరాణి సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌కు బదిలీకాగా వీడ్కోలు సమావేశం గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటుగా జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ హాజరై సన్మానించారు. కరోనా సమయంలో వైద్యులు వారి ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలను కాపాడినట్లు గుర్తు చేశారు. 12 సంవత్సరాలుగా హోమియో వైద్యాధికారిగా గీతరాణి చేసిన సేవలు మరవలేవన్నారు. ఇందులో ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి, ఎంపీడీఓ భాస్కర్, ముల్కనూర్ సర్పంచ్ మాడ్గుల కొంరయ్య, ఎస్ఐ షరీఫొద్దిన్, ఉపసర్పంచ్ సుద్దాల రఘు, మ్యాక లాజరస్, గూడెల్లి రాజిరెడ్డి, మండల సురేందర్ తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో కిచెన్ షెడ్ నిర్మించాలని, పాఠశాలలో గ్రౌండ్ ఫ్లోర్ దెబ్బతిన్న దృష్ట్యా మరమ్మతు చేయాలంటూ విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు.

ప్రమాదం లేదు.. బస్సుకు మరకలేదు





ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లు బీ.డీ రెడ్డి, ఎం.డీ యాకుబ్‌లను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

- ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌లకు సన్మానం

పరకాల: 26 సంవత్సరాల సర్వీసులో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు చేయకుండా గత ఎనిమిది నెలలుగా ఆర్టీసీ బస్సులకు ఎలాంటి నష్టం రాకుండా విధులు నిర్వహిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేరుస్తున్న ముగ్గురు ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను పరకాల ఆర్టీసీ డిపో అధికారులు గురువారం సన్మానించారు. పరకాల ఆర్టీసీ డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తితో పాటు డిపో అధికారులు హాజరై ఉత్తమ డ్రైవర్లు రవీందర్, బీ.డి రెడ్డి, ఎం.డీ యాకుబ్‌లను తోటి కార్మికుల సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉత్తమ డ్రైవర్లకు ఆర్టీసీ ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డును అందిస్తామన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల క్షేమంతో పాటు ఆర్టీసీ నష్టం రాకుండా ప్రమాదాల నివారణకు కార్మికులు కృషిచేయాలన్నారు.

నిధుల వినియోగంపై స.హ దరఖాస్తులు



కొత్తగట్టు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని కొత్తగట్టు, అక్కంపేట, కామారం, పెంచికలపేట, గూడెప్పాడ్ గ్రామాల్లో గురువారం పంచాయతీ కార్యదర్శులకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కొరకు దరఖాస్తు చేశారు. గ్రామంలోని వీధిలైట్లు కొనుగోలు చేయడానికి, గ్రామపంచాయతీల్లో టెండర్లు ఎన్నిసార్లు చేశారో ఆ జిరాక్స్ కాపీలు ఇవ్వగలరని సమాచారం అడిగారు. గ్రామ పంచాయతీకి వచ్చిన నిధుల నుంచి సైడ్ కాల్వల మొరం పనులు, సీసీ రోడ్లు రూ. 50 వేలు టెండర్ దాటితే టెండర్ విధానాన్ని అమలు చేయాలని ఎన్నిసార్లు టెండర్ విధానాన్ని అమలు చేశారో వాటి వివరాలు ఇవ్వాలని గ్రామ కార్యదర్శులను సమాచార హక్కు చట్టం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరికిరాల వాసు, అలువాల రవి, చిమ్మని దేవరాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.